పేరుకేనా.. పురాతన ఆలయం!

- శిథిలమైన వేణుగోపాలస్వామి గుడి
- మధ్యలోనే పనుల నిలిపివేత
- మౌలిక సదుపాయాల కొరత


ఎస్ఎస్‌పట్నంలో శిథిలావస్థలో వేణుగోపాలస్వామి ఆలయం

రౌతులపూడి: పురాతన ఆలయాలు, చారిత్రక సంపదను సంరక్షించి భావితరాలకు వారసత్వ సంపదగా అందించే పురాతన దేవాలయాలు ఎలాంటి అభివృద్ధికి నోచుకోకుండా కొన్ని సంవత్సరాలుగా నిర్లక్ష్యంగా దర్శనమిస్తున్నాయి. దీంతో ప్రజలకు స్థానికంగా ఎలాంటి దైవారాధనలకు నోచుకోక ఆధ్యాత్మిక దైవరాధనల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. మండలంలోని నామగిరి నరేంద్రపట్నంగా పేరుగాంచిన ఎస్ఎస్ పట్నంలో కొలువై ఉన్న వేణుగోపాలస్వామి ఆలయం పూర్తిగా శిథిలమైంది. గతంలో అనేక పర్యాయాలు పత్రికల్లో వచ్చిన కథనాల మేరకు పురావస్తు శాఖ అధికారులు శిథిలమైన దేవాలయాన్ని పరిశీలించి కొంతమేరకు అభివృద్ధి చేసి మధ్యలో నిలిపివేశారు. దీంతో గత పదేళ్లుగా ఎలాంటి నిర్మాణాలకు నోచుకోకుండా ఆలయం నిర్లక్ష్యంగా ఉంది.

దేవాలయ చరిత్ర ఇదీ..

క్రీ.శ.11వ శతాబ్దంలో వేంగి రాజ్యాన్ని విజయాదిత్యుడు పరిపాలించేవారు. ఆయన సోదరుడు భీమస్కలితో జరిగిన యుద్ధంలో ఓటమి పాలై ఇక్కడికి వచ్చారు. ఈ ప్రాంతంలో కొండపై కోట, కోట దిగువన వేణుగోపాలస్వామి ఆలయాన్ని నిర్మించి ప్రతిరోజు పూజలు చేసేవారు. కోటలో నివాసముంటూ తన సైన్యాన్ని సమకూర్చుకొని తిరిగి రాజ్యానికి వెళ్లేవారు అనేది చారిత్రక అంశం. చోళుల కాలంలో ఉన్న విధంగా పూర్తిగా రాతితో నిర్మించిన ఆలయంలో ఆస్థాన మండపం, నాట్య మండపం, ప్రత్యేక రాతితో చెక్కిన వేణుగోపాలస్వామి విగ్రహం, బయట నాగసర్ప ఆలయం వంటి ఎన్నో ప్రత్యేకతలు ఈ ఆలయంలో దర్శనమిచ్చేవి. అలనాటి చరిత్రలో విజయాదిత్యుడుకు నరేంద్ర మృగరాజు అనే బిరుదు ఉండేదని, ఆ పేరునే గ్రామానికి నామగిరి నరేంద్రపట్నంగా పేరొందిందని గ్రామంలోని పూర్వీకులు ఇప్పటికీ చెబుతుంటారు.

నిలిచిన ఆలయ నిర్మాణ పనులు

శిథిలమైన పురాతన దేవాలయం పునఃనిర్మాణానికి పదేళ్ల క్రితం పురావస్తు శాఖ నుంచి రూ.70 లక్షలు వెచ్చించి నిర్మాణ పనులు చేపట్టారు. ఆలయ గోడలకు అమర్చిన రాళ్లను తీసేసి సంఖ్యలను ఏర్పాటు చేశారు. ఆయా రాళ్లను సంఖ్యాపరంగా వాటి స్థానంలో ఏర్పాటు చేశారు. గతంలో విరిగిన రాళ్ల స్థానంలో కొత్త రాళ్లను ఏర్పాటు చేశారు. అప్పటికి వెచ్చించిన నిధులు సరిపోక ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేయకుండా సగంలోనే నిలిపేశారు. ఆలయ నిర్మాణాన్ని పూర్తిచేసి ప్రజల దైవారాధనలకు అందుబాటులోకి తేవాలని అనేక సార్లు సంబంధిత అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా పురావస్తు శాఖ అధికారులు స్పందించి సగంలో నిలిచిపోయిన వేణుగోపాలస్వామి ఆలయ నిర్మాణ పనులు పూర్తిచేయాలని, భక్తుల సౌకర్యార్థం ఆలయంలో మరుగుదొడ్లు, తాగునీరు వంటి మౌళిక సదుపాయాలను సమకూర్చాలని, ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.

> **అదనపు నిధుల కోసం ప్రతిపాదనలు పంపించాం**
>
> ఎస్ఎస్ పట్నంలో సగంలో నిలిచిపోయిన పురాతన వేణుగోపాలస్వామి ఆలయ నిర్మాణానికి మరో రూ.60 లక్షలు వరకు వెచ్చించాల్సి ఉంది. ఆయా నిధులతో ఆలయ విమాన గోపురం, ఆలయం లోపల రాతి నిర్మాణ పనులు, ఎలక్ట్రికల్ పనులు, ప్రహారి పనులు వంటివి చేయాల్సి ఉంది. నిధులు మంజూరైతే త్వరలో వాటి నిర్మాణ పనులు చేపడతాం.
>
> – తిమ్మరాజు, ఏడీ, పురావస్తుశాఖ

పలువురికి ముదునూరి సాయం


బాధితులకు ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న మురళీకృష్ణంరాజు

ప్రత్తిపాడు: మండలంలోని చినశంకర్లపూడి గ్రామంలో అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటు పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు చేయూత అందించారు. సోమవారం సాయంత్రం ఆయన గ్రామంలో పర్యటించి, బాధిత కుటుంబాలను పరామర్శించారు. సమస్యను పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళతానని ఆయన భరోసా ఇచ్చారు. ఒక్కొక్క కుటుంబానికి రూ.10 వేలు చొప్పున ఆరు కుటుంబాలకు రూ.60 వేలు ఆర్థిక సాయాన్ని చెక్కుల రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఏపూరి రామారావు, ఎంపీటీసీలు పిల్లా చిన్నా, నానిపల్లి చంటి, మాజీ ఉప సర్పంచ్ పిడుగు సత్యనారాయణ, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మొండిచేయి చూపిస్తున్న చంద్రబాబు


పెరుమాళ్లపురంలో ఇంటింటా కరపత్రాలు అందజేస్తున్న యనమల కృష్ణుడు


క్యూఆర్ కోడ్‌తో చంద్రబాబు మోసాలు వివరిస్తున్న నాయకులు

తొండంగి: రాష్ట్ర ప్రజలకు అడ్డగోలు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రజలను మోసం చేయడం తప్ప చేసిందేమి లేదని వైఎస్సార్ సీపీ తుని నియోజకవర్గ నాయకుడు యనమల కృష్ణుడు అన్నారు. సోమవారం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా ఆదేశాల మేరకు మండలంలోని కోనప్రాంతం పెరుమాళ్లపురంలో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని పార్టీ నాయకులతో కలిసి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ఎన్నికలకు ముందు చంద్రబాబు ప్రజలకు హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చాక మొండిచేయి చూపించడం అలవాటని ఎద్దేవా చేశారు. అనంతరం చింతకాయలపేట, ఆవులమంద, పెరుమాళ్లపురం గ్రామాల్లో ఇంటింటా పర్యటించి వైఎస్సార్ సీపీ హయాంలో జరిగిన లబ్ధిని గుర్తుచేస్తూ.. బాబు పాలనలో జరిగిన మోసంపై వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పంచాయతీ విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కొయ్యా మురళి, మండల కన్వీనర్ బత్తుల వీరబాబు, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, యువజన విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మడదా హేమంత్ తదితర నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాలపై ఇంటింటా ప్రచారం

తుని రూరల్: అధికార అంధాలం ఎక్కేందుకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా చంద్రబాబు నాయుడు ప్రజలను మోసం చేశారని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి చింతల వెంకటరమణ అన్నారు. సోమవారం డి.పోలవరంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా ఆదేశాలతో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు అన్నంరెడ్డి వీర్రాఘవులు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు డొంక వెంకట బెనర్జీ, మండల జనరల్ సెక్రటరీ అక్కం రెడ్డి దొరబాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న గ్రావెల్ మాఫియా


ట్రాక్టర్‌పై తరలిస్తున్న గ్రావెల్

కోటనందూరు: మండలంలో గ్రావెల్ మాఫియా అధికార పార్టీ అండదండలతో రెచ్చిపోతోంది. స్థానిక గొంపకొండను కొల్లగొట్టి పట్టపగలే వందల ట్రాక్టర్ల గ్రావెల్‌ను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ప్రభుత్వానికి పైసా కట్టకుండా వారి నిర్ణయించిందే ధర అన్నట్లుగా ప్రజలపై భారం వేసి జేబులు నింపుకుంటున్నారు. కళ్ల ముందే వందల ట్రాక్టర్ల ట్రావెల్‌ను తరలించేస్తున్నా.. ప్రేక్షక పాత్ర వహిస్తున్న అధికారులు, ప్రతిపక్షానికి చెందిన వారు తరలిస్తే నిమిషాల వ్యవధిలో కేసులు నమోదు చేయడం, అపరాధ రుసుములు విధించడం చకచకా జరిగిపోతున్నాయి. అధికారుల తీరుపై ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

భయభ్రాంతులకు గురిచేస్తున్న డ్రైవర్లు..

గ్రావెల్ తరలించే ట్రాక్టర్ డ్రైవర్లు మితిమీరిన వేగంతో ట్రాక్టర్లను నడుపుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఎటు నుంచి ప్రమాదం ముంచుకొస్తుందోనని తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రద్దీగా ఉండే రోడ్లపై డ్రైవర్ల నిర్లక్ష్యంతో ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. గ్రావెల్ మాఫియా ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

తాత్కాలికంగా సద్దుమణిగిన వివాదం


సీఐ, ఎంపీడీఓ, ఆర్ఐకి సమస్యను వివరిస్తున్న సర్పంచ్

తుని రూరల్: అనుమతులు లేకుండా శ్మశానవాటిక వద్ద కల్వర్టు ధ్వంసం చేయడం, పాఠశాల సమీపంలో కాలువ తవ్వడంపై నెలకొన్న వివాదం అధికారుల జోక్యంతో తాత్కాలికంగా సద్దుమణిగింది. ఆదివారం హంసవరంలో మండల పరిషత్ ఎస్సీ పాఠశాలను అనుకొని ఉన్న శ్మశానవాటిక వద్ద కాల్వర్టు ధ్వంసం చేయడం, కాలువ తవ్వడాన్ని సర్పంచ్ మేరీ అవినాష్, మాజీ ఎంపీటీసీ రాందాసు, దళితులు అడ్డుకున్న విషయం తెలిసిందే. ఈ సంఘటనపై రూరల్ సీఐ చెన్నకేశవరావు, రూరల్ ఎస్సై బి.కృష్ణమాచారి, ఎంపీడీఓ కె.సాయినవీన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి, ఇరువర్గాలతో సమావేశం నిర్వహించారు. ధ్వంసం చేసిన కల్వర్టును వారం రోజుల్లో పునఃనిర్మిస్తామని, అప్పటివరకు ఎటువంటి పనులు చేపట్టవద్దని ఇరువర్గాలకు సూచించారు. అందుకు అంగీకరించడంతో వివాదం తాత్కాలికంగా సద్దుమణిగింది.

తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం


కిర్లంపూడి పీహెచ్‌సీలో తల్లిపాలపై అవగాహన



తల్లిపాల వారోత్సవాల సభలో ప్రసంగిస్తున్న సౌమ్య మైఖేల్

కిర్లంపూడి: తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ జగ్గంపేట సీడీపీఓ పూర్ణిమ తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని కిర్లంపూడి, వీరవరం పీహెచ్‌సీలలో వైద్యులు హెమాంజలి, బి.స్వాతి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది, గర్భిణులు, బాలింతలు, అంగన్వాడీ సిబ్బందికి తల్లి పాలు ప్రయోజనాలపై సోమవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వైద్యులు మాట్లాడుతూ, బిడ్డపుట్టిన దగ్గర నుంచి ఆరు నెలలపాటు శిశువుకు తల్లిపాలు ఇవ్వటం వల్ల పిల్లలకు రోగనిరోధక శక్తి లభిస్తుందన్నారు. తల్లి పాలు ఇవ్వటం వల్ల తల్లులకు రొమ్ము క్యాన్సర్, మధుమేహం బారిన పడకుండా ఉంటారన్నారు. అనంతరం బూరుగుపూడిలో పలువురు గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు.

తల్లిపా బిడ్డకు అమృతం

తుని రూరల్: తల్లిపాలు పుట్టిన బిడ్డకు అమృతంలా పని చేస్తాయని ఐసీడీఎస్ సీడీపీఓ కె.శ్రీలత అన్నారు. సోమవారం ఎన్.సూరవరం సెక్టార్ ఎన్ ఎస్‌వీ పురం, హంసవరం సెక్టార్ జిల్లేడుపాడు గ్రామాల అంగన్‌వాడీల ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. గర్భిణులకు సీమంతాలు చేసి తల్లిపాల విశిష్టత, పౌష్టిక ఆహారం ఆవశ్యకతలపై బాలింతలకు, గర్భిణులకు అవగాహన కల్పించారు. శ్రీలత మాట్లాడుతూ, తల్లీబిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే గర్భిణులు ఆకుకూరలు, కూరగాయలు, పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టిక ఆహారాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. సూపర్‌వైజర్ విజయలక్ష్మి, అంగన్‌వాడీలు కె.సత్యకుమారి, బి.నాగమణి, ఆయాలు పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరం

ప్రత్తిపాడు: బిడ్డకు తల్లిపాలే శ్రేష్టమైనవని, పాలు ఇవ్వడం వల్ల తల్లికి అనేక ప్రయోజనాలు ఉన్నాయని ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) సూపరింటెండెంట్ సౌమ్య మైఖేల్ అన్నారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, తల్లి పాలు ఇవ్వడం వల్ల ప్రసవానంతరం రక్తస్రావం తగ్గించడం, రొమ్ము-అండాశయ క్యాన్సర్, టైప్-2 డయాబెటిస్, అధిక రక్తపోటు ప్రమాదాలను తగ్గిస్తుందన్నారు. సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సభ్యుడు వెలుగుల కొండలరావు మాట్లాడుతూ, అన్ని వసతులు ఉన్న ప్రభుత్వాసుపత్రుల్లోనే పురుడు పోసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

యాప్‌ల భారాన్ని తగ్గించండి


తునిలో అంగన్వాడీల నిరసన

తుని: అంగన్వాడీలపై యాప్‌ల భారాన్ని తగ్గించాలని యూనియన్ ప్రతినిధులు ధనలక్ష్మి, ఉమామహేశ్వరి డిమాండ్ చేశారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ఈ మేరకు సోమవారం నిరసన చేపట్టారు. గతంలో ప్రభుత్వం అంగన్వాడీలకు ఇచ్చిన ఫోన్లు సక్రమంగా పని చేయట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. యాప్‌ల భారం ఎక్కువై, ఫోన్లు పని చేయక అంగన్వాడీలు మానసిక క్షోభకు గురవుతున్నారన్నారు. నాణ్యమైన 5జీ ఫోన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పాత ఫోన్లను సీడీపీఓ శ్రీలతకు అప్పగించే ప్రయత్నం చేయగా.. ఆమె తిరస్కరించడంతో ఎల్‌డీసీ రూంలో అప్పగించినట్లు అంగన్వాడీలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శ్రీనివాస్, కామేశ్వరి, అంగన్వాడీలు తదితరులు పాల్గొన్నారు.

పనిచేయని ఫోన్లు, యాప్‌లతో అవస్థలు

జగ్గంపేట: ప్రభుత్వం రకరకాల యాప్‌లు ప్రవేశపెట్టడంతో గతంలో ఇచ్చిన 2జీ ఫోన్లు పనిచేయట్లేదని అంగన్‌వాడీ సిబ్బంది జగ్గంపేటలో సోమవారం నిరసన చేపట్టారు. జగ్గంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని 182 మంది అంగన్‌వాడీ సిబ్బంది సీడీపీఓ కార్యాలయం వద్ద ఈ ఫోన్లు మాకొద్దు, పనిచేయని యాప్‌లతో నానా అవస్థలు పడుతున్నామంటూ నినాదాలు చేశారు. తమ వద్ద ఫోన్లను సీడీపీఓ కార్యాలయంలో అప్పగించారు. గర్భిణులకు, బాలింతలకు ఫేస్ యాప్‌లో రిజిస్టర్ చేయమంటున్నారని, వాటికి గంటల తరబడి సమయం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. 5జీ ట్యాబ్‌లు ఇస్తే పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని, లేకుంటే పనిచేయడం కష్టమవుతుందని తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి మండలాల అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.


జగ్గంపేట ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీల ఆందోళన

18 శక్తి పీఠాలు ప్రతిష్ట

కిర్లంపూడి: మండలంలోని రామచంద్రాపురంలో ఉన్న కనకదుర్గమ్మ ఆలయంలో సోమవారం 18 శక్తి పీఠాలు ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు మహా చండీహోమం, గణపతి హోమం నిర్వహించారు. సర్పంచ్ తుమ్మలపల్లి సాయి గుణశేఖర్, జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేశారు.

పగలే వెలుగుతున్న వీధి లైట్లు


తాళ్లూరులో పగలు కూడా వెలుగుతున్న వీధి లైట్లు

గండేపల్లి: మండలంలోని తాళ్లూరులో వీధి దీపాలను అధికారులు పట్టించుకోకపోవడంతో పగలు కూడా వెలుగుతున్నాయి. కొన్ని రోజులుగా వీధి లైట్లు పగలు కూడా వెలుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. రాత్రి మాత్రమే అవసరమయ్యే వీధి లైట్ల వెలుతురును విద్యుత్, పంచాయితీ అధికారుల నిర్లక్ష్యంతో పగలు కూడా అందిస్తున్నారని పేర్కొన్నారు. అధికారులు విద్యుత్‌ను దుర్వినియోగం చేస్తున్నారని గ్రామస్తులు విమర్శలు గుప్పిస్తున్నారు.

ఆ ఉద్యోగిపై చర్యలు తీసుకోండి

ఈఓకు దేవదాయశాఖ మంత్రి ఆదేశం

అన్నవరం: రెండ్రోజుల క్రితం పోలీసుల దాడిలో పట్టుబడిన ఐదుగురు పేకాట రాయుళ్లలో ఒకరు స్థానిక రత్నగిరి దేవస్థానం ఉద్యోగి అంటూ సోమవారం పత్రికల్లో వచ్చిన వార్తలపై రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి స్పందించారు. ఆ ఉద్యోగి ఎవరో విచారణ జరిపి క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఈఓ వీర్ల సుబ్బారావును మంత్రి ఆదేశించారు. దాంతో ఆయన దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్‌ను విచారణ జరపాలని ఆదేశించారు.

రామలింగేశ్వరుడికి సుగంధాభిషేకం

గండేపల్లి: మండలంలోని తాళ్లూరులో ఉన్న రామలింగేశ్వర స్వామికి శ్రావణ శుద్ధ ఏకాదశి సోమవారం సందర్భంగా అర్చకులు మూర్తి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం శివనామ స్మరణతో మారుమోగింది. భక్తులు స్వామి వారిని దర్శించుకొని ప్రసాదాలు స్వీకరించారు.

త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం

ఏలేశ్వరం: పట్టణంలో సోమవారం ఏలేశ్వరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కమిటీ చైర్మన్ సూతిబూరయ్య, సభ్యులు వైభోగుల సుబ్బారావు ప్రమాణ స్వీకారం చేశారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. రైతుల శ్రేయస్సే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గట్టెం వెంకటరమణ, సింగిలిదేవి సత్తిరాజు, పసల సూరిబాబు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

తుని: రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక జీఆర్పీ ఎస్సై శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం.. ఓ వ్యక్తి స్థానిక నాగరాజుపేట రైల్వేగేటు నుంచి తుని రైల్వేస్టేషన్‌కు పట్టాలపై నడిచి వెళ్తుండగా విశాఖపట్నం నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతదేహన్ని తుని ఏరియా ఆసుపత్రిలో భద్రపరిచారు. వివరాలు తెలిసిన వారు 94906 19020 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

క్లుప్తంగా

అనారోగ్యంతో సర్పంచ్ మృతి


దూడల రామస్వామి (ఫైల్)

శంఖవరం: మండలంలోని కొంతంగి సర్పంచ్ దూడల రామస్వామి (67) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఈయన వైఎస్సార్ సీపీ నాయకుడిగా వ్యవహరిస్తూ పార్టీ సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. పార్టీ పరంగా సేవలందిస్తూ బీసీ రిజర్వేషన్ రావడంతో గత స్థానిక ఎన్నికల్లో సర్పంచ్‌గా పోటీ చేసి విజయం సాధించారు. అనారోగ్యానికి గురికావడంతో వైజాగ్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుమార్తె నరాల శ్రీలత నెల్లిపూడి సర్పంచ్‌గా సేవలందిస్తున్నారు. ఆయన మృతి పట్ల పలువురు నివాళులర్పించారు.

ముద్రగడ కోలుకోవాలని పూజలు


ఆలయంలో పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఇ.గోకవరం పంచాయతీ పరిధిలోని ఎరకంపాలెంలో దార మల్లిఖార్జున స్వామి ఆలయంలో వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం త్వరగా కోలుకోవాలని సోమవారం స్వామి లక్ష్మానంద ఆధ్వర్యంలో నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముద్రగడ పద్మనాభం నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని నాయకులు పేర్కొన్నారు. వైద్య చికిత్స అనంతరం సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రామిశెట్టి నాని, లొండ బాబులు, దేవ లక్ష్మణ్, తంపటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అటవీ భూముల సరిహద్దుల పరిశీలన


అటవీ భూముల సరిహద్దులు పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

రౌతులపూడి: మండలంలోని రాఘవపట్నం, అనంతారం, ములగపూడి తదితర ప్రాంతాల్లోని అటవీ భూములను స్క్వాడ్ డీఎఫ్ఓ శ్రీనివాసరావు సోమవారం పరిశీలించారు. అటవి సరిహద్దుల్లో ఎలాంటి ఆక్రమణలూ లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. అటవి భూములను ఎవరైనా ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏలేశ్వరం అటవీ రేంజర్ దుర్గారామ్ ప్రసాద్, సెక్షన్ అధికారి శ్యామ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్సైజ్ దాడుల్లో ముగ్గురి అరెస్టు

ప్రత్తిపాడు: ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో సోమవారం దాడులు చేసి ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానిక ఎక్సైజ్ సీఐ శివప్రసాద్ వివరాల ప్రకారం.. యర్రవరం- కంపాలపాలెం రోడ్డులో ఎక్సైజ్ పోలీసులు రూట్ వాచ్ నిర్వహిస్తుండగా యర్రవరంలో ఆటోలో 90 లీటర్ల సారాను అక్రమంగా తరలిస్తున్నారు. ఆటో, సారా స్వాధీనం చేసుకొని ప్రత్తిపాడు మండలం చినశంకర్లపూడికి చెందిన పొన్నాడ ఏసుబాబు, ఏలేశ్వరం మండలం భద్రవరానికి చెందిన నామా సత్యనారాయణలను అదుపులోకి తీసుకున్నారు. వీరికి నల్లబెల్లం సరఫరా చేసిన పెద్దనాపల్లికి చెందిన కొడేల రాంబాబుపై కేసు నమోదు చేశారు. తోటపల్లి గిరిజన తండాలో సారా విక్రయిస్తున్న గిట్ల తులసిని అరెస్టు చేశారు. ముగ్గురు నిందితులను స్థానిక కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారన్నారు.

భవిత కేంద్రం తనిఖీ

గోకవరం: గ్రామంలోని దాసరి వారి వీధిలో సమగ్రశిక్ష అభియాన్‌లో ఉన్న భవిత కేంద్రాన్ని సోమవారం జిల్లా సహిత విద్యా కో-ఆర్డినేటర్ కనకబాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో రికార్డులు తనిఖీ చేసి విద్యార్థులకు అందుతున్న ఫిజియోథెరపీ వైద్య సేవలు, విద్యాబోధన వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి గురువారం విద్యార్థులకు నిర్వహిస్తున్న ఫిజియోథెరపీ క్యాంప్‌ను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్‌టీ ఉపాధ్యాయులు ఎస్తేర్‌రాణి, ఎస్.మణికంఠ ఉన్నారు.

ఎంఈఓ-1గా సతీష్‌బాబు

రౌతులపూడి: మండల విద్యాశాఖాధికారి-1గా కస్నూరి సతీష్‌బాబు నియమితులయ్యారు. కాకినాడ పీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ గణితం ఉపాధ్యాయుడిగా పనిచేసిన ఆయన పదోన్నతిపై రౌతులపూడి ఎంఈఓ-1గా వచ్చారు. ఈ మేరకు ఆయన సోమవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఎంఈఓ-2 గాడి కొండబాబు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు బి.తాతబాబు, పడాల శ్రీనివాస్, గంటిమళ్ల సత్యన్నాయణ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.